క్లుప్తంగా

ఉపాధి హామీ పనుల పరిశీలన



వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలంలోని ఐనవోలు, పాతజడ్డవారిపాలెం గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులను ఎంపీడీవో జిలానీబాషా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కూలీల మస్టర్స్‌ను, పని ప్రదేశాల్లో నీడ వసతిని పరిశీలించి కూలీలకు వేసవి కాలంలో అందుతున్న వసతులపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాతజడ్డవారిపాలెంలో సర్పంచ్ సుబ్బారావు ఆధ్వర్యంలో మజ్జిగ ప్యాకెట్లను కూలీలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీవో కట్టా నాగేశ్వరరావు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలి

వినుకొండ (నూజెండ్ల): రైతు భరోసా, పీఎం కిసాన్ లబ్ధి పొందేందుకు అర్హత గల రైతులు రైతు భరోసా కేంద్రాల్లో మే నెల చివరి లోపు ఈ–కేవైసీ చేయించుకోవాలని ఏడీఏ బి.రవి బాబు తెలిపారు. వినుకొండ మండలంలో 1130 మంది రైతులు, శావల్యాపురం మండలంలో 1321, బొల్లాపల్లిలో 2149, ఈపూరు మండలంలో 1759 , నూజెండ్ల మండలంలో 1439 మంది రైతులు తమ ఆధార్‌తో ఈకేవైసీ చేయించుకోవాలని తెలిపారు. అలాగే రైతులు తమ ఆధార్, బ్యాంక్ అకౌంట్‌ను అనుసంధానం చేయించుకోవాలని సూచించారు. వినుకొండలో 104 మంది రైతులు, నూజెండ్లలో 125, శావల్యాపురంలో 109, బొల్లాపల్లిలో 184, ఈపూరులో 119 మంది రైతులు బ్యాంక్ అకౌంట్‌కు ఆధార్‌ను అనుసంధానం చేసుకోలేదని తెలిపారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

శావల్యాపురం: మండలంలోని పోట్లూరులో బీసీ కాలనీలో బాల వికాస్ స్వచ్ఛంద సంస్థ, పంచాయతీ వారి సారథ్యంలో రూ. 4 లక్షల నిధులతో తాగునీటి సమస్య పరిష్కార దిశగా చర్యలు చేపట్టినట్లు సర్పంచ్ పోపూరి జ్యోతి బుధవారం తెలిపారు. కొంకెరువాగు సమీపంలో 500 మీటర్ల మొర కాలనీలోకి పైపు లైను ఏర్పాటు చేసి తదుపరి విద్యుత్ మోటార్ల ద్వారా తాగునీరు కాలనీవాసులకు అందేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఇందులో భాగంగా బీసీ కాలనీలో 1000 లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ షెడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేశామన్నారు. నెలరోజుల వ్యవధిలో పనులు పూర్తి అవుతాయన్నారు. ఈకార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వంగళ్ళ అంజయ్య, తమ్మిశెట్టి అంకారావు, అబ్బూరి రామారావు, అయ్యన్న,పోపూరి చిన్నా, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐవైఎఫ్ వ్యవస్థాపక దినోత్సవం

నరసరావుపేట ఈస్ట్: అరండల్‌పేటలోని సీపీఐ కార్యాలయం వద్ద బుధవారం ఏఐవైఎఫ్ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏఐవైఎఫ్ కార్యదర్శి గుండాల హర్ష పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో సమాఖ్య నాయకులు యు.రాజు, మణికంఠ, మాజీ కార్యదర్శులు వైదన వెంకట్, షేక్.చిన జాన్‌సైద తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఉచిత కరాటే శిక్షణ శిబిరం

నరసరావుపేట ఈస్ట్: రోటారాక్ట్ క్లబ్ ఆఫ్ నరసరావుపేట ఫీనిక్స్ ఆధ్వర్యంలో ఉచిత కరాటే శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్టు రోటారాక్ట్ క్లబ్ అధ్యక్షుడు దమ్మాటి అశోక్‌కుమార్ బుధవారం తెలిపారు. ఈనెల 5వ తేదీ నుంచి 31వ తేదీ వరకు కరెంట్ ఆఫీస్ రోడ్డులోని శ్రీరామకృష్ణ ఓరియంటల్ పాఠశాలలో ప్రతిరోజు ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. ఎస్.ఐ.ఎస్ జూడో, కరాటే కోచ్ శిరీష ఆధ్వర్యంలో ఉచితంగా శిక్షణ ఇప్పిస్తున్నట్టు వివరించారు. వివరాలకు 8179408337, 9959911804 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

6న రొంపిచర్ల మండల పరిషత్ భేటీ

రొంపిచర్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఈ నెల 6న మండలపరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎండీఓ కె.మ్యాథ్యూబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో మండలంలో నెలకొన్న సమస్యలపై, ఇతర అంశాలపై సమీక్ష జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు పాల్గొనాలని ఆయన కోరారు.

తిరునాళ్లను జయప్రదం చేయండి

వినుకొండ టౌన్: రూరల్ పరిధిలోని వితంరాజుపల్లి గ్రామ శివారు ప్రాంతం వీరపనేని నగర్‌లో అభయాంజనేయ స్వామి తిరునాళ్ల ఈ నెల 5న నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పల్లపు పున్నయ్య దంపతులు బుధవారం తెలియచేశారు. వేకువ జాము నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలతో తిరునాళ్ల ప్రారంభమౌతాయని వారు వెల్లడించారు.

అగ్రహార భూముల సర్వే ఘనత మాదే

- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- కంభంపాడులో 'గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం'



కంభంపాడులో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. మండల పరిధిలోని కంభంపాడు గ్రామంలో బుధవారం జరిగిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే బొల్లా పాల్గొని ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న భూహక్కు పథకం కింద ప్రభుత్వం రీ సర్వే చేపట్టిందని, నూజెండ్ల మండలంలోని అప్పాపురం, కొండ్రప్రోలు, తిమ్మాపురం గ్రామాల్లో అగ్రహార భూములను కూడా సర్వే చేసి రైతులకు హక్కులు కల్పిస్తున్నట్లు చెప్పారు. నాడు–నేడు పథకం కింద వందల కోట్ల నిధులతో పాఠశాలలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దినట్లు చెప్పారు. నూజెండ్ల మండలంలో గుండ్లకమ్మ నదిపై 5 లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. అలాగే మండలంలోని పువ్వాడ వద్ద రెండు జిల్లాలను కలుపుతూ బ్రిడ్జి నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. కంభంపాడు గ్రామంలో కూడా లిఫ్ట్ ఇరిగేషన్ పథకం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే సీతారామపురం వద్ద నూతన ఆస్పత్రి నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. రానున్న రోజుల్లో అనేక అభివృద్ధి పనులు చేపట్టి మండలాన్ని మోడల్‌గా తీర్చిదిద్దుతామన్నారు.

టీడీపీ హయాంలో అభివృద్ధి శూన్యం

నియోజకవర్గంలో టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల సభ్యులు పేదవారి దగ్గర కూడా సంక్షేమ పథకాల పేరుతో దోచుకోవడం తప్ప చెప్పుకోదగిన ఏఒక్క అభివృద్ధి పనులు జరుగలేదన్నారు. నియోజకవర్గంలో అనేక గ్రామాలల్లో సీసీ రోడ్లు కూడా నాసిరకంగా వేసి ప్రజాధనాన్ని దోచుకున్నారన్నారు. నీరు చెట్టు, ఉపాధి హామీ, ఇంకుడు గుంతలు, పేరుతో కోట్లాది రూపాయలు పనులు చేయకుండానే దోచుకున్నారని దుయ్యబట్టారు. మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ముఖ్యమంత్రిని విమర్శించే స్థాయి లేదన్నారు. రాజకీయంగా ఉనికిని కోల్పోయి. గ్రామాలల్లో అలజడులు సృష్టించి రాజకీయ లబ్ధికోసం పాకులాడుతున్నారని విమర్శించారు. ప్రజలు అంతా గమనిస్తున్నారని, గతంలో కంటే వినుకొండ నియోజకవర్గంలో ఎంత మార్పు వచ్చిందో ప్రజలకు తెలుసని రానున్న రోజుల్లో టీడీపీకి ప్రజలు బుద్ధి చెబు తారన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నక్కా నాగిరెడ్డి, ఎంపీపీ మేడం జయరామిరెడ్డి, జెడ్పీటీసీ జడ్డా సుబ్బులు రామయ్య, మార్కెట్ యార్డు చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లు యాదవ్, వైస్ చైర్మన్ కొమిరిశెట్టి రామారావు, ఎంపీటీసీ వెంకటేశ్వరరెడ్డి, స్థానిక నాయకులు అంజిరెడ్డి, హనుమయ్య, పసుపులేటి కొండలు, తలారి ఆంజనేయులు, జెడ్పీ కోఆప్షన్ గుండాల స్వెనోమ్, ఒంగూరి ప్రసాద్, గాదె నాగార్జునరెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

త్వరలో వరికపూడిసెల ప్రాజెక్టు నిర్మాణం పూర్తిచేస్తాం

ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ (నూజెండ్ల): వరికపూడిసెల నిర్మాణంతో పల్నాడు ప్రజల తాగు, సాగునీటి కష్టాలు తీరనున్నాయని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. వరికపూడిసెల ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్రం అనుమతులు మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బొల్లాపల్లి మండల జడ్పీటీసీ బీమీబాయి కృష్ణానాయక్ ఆధ్వర్యంలో వరికపూడిసెల ప్రాజెక్టు మంజూరు కావడంపై ఎమ్మెల్యేను కలిసి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీల్లో వరికపూడిసెల కూడా ఉందని, బడ్జెట్‌లో ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు మంజూరు చేయడమే కాకుండా కేంద్ర ప్రభుత్వ అనుమతులు వచ్చేలా కృషి చేయడం అభినందనీయమన్నారు.

ప్రాజెక్టు నిర్మాణం అయితే మాచర్ల, వినుకొండ నియోజకవర్గాల్లోని వెల్దుర్తి, దుర్గి, బొల్లాపల్లి మండలాల్లో 50 వేల నుంచి 70 వేల ఎకరాలకు సాగునీటితో పాటు 4.5 లక్షల మంది ప్రజలకు తాగునీరు సౌకర్యం కూడా కలుగుతుందన్నారు. చంద్రబాబు, టీడీపీ నాయకులు పిచ్చి జీవోలు తీసుకొచ్చి ప్రజలను మోసం చేశారని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే స్థాయి లేదని, నోటికొచ్చినట్లు ముఖ్యమంత్రిని విమర్శించడాన్ని తప్పుపట్టారు. మునసోడా అంటూ మాజీ ఎమ్మెల్యే జీవీ వందసార్లు చంద్రబాబునే అన్నారన్నారు. త్వరలోనే ప్రాజెక్టు నిర్మాణం పూర్తవుతుందని, రానున్న రోజుల్లో బొల్లాపల్లి మండలం సస్యశ్యామలమవుతుందన్నారు. కార్యక్రమంలో బొల్లాపల్లి మండల నాయకులు బత్తి గురవయ్య, అవినాష్‌రెడ్డి, శ్రీనివాస రెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

బాలికను పరామర్శించిన కమిషన్ సభ్యుడు

- కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన కమిషన్ సభ్యులు శంకరనాయక్
- వేడిరసం ఒంటిపై పడి బాలికకు గాయాలు
- భవిష్యత్‌లో ఇటువంటి సంఘటనలు జరగనివ్వమంటూ వెల్లడి



బాలికను పరామర్శిస్తున్న శంకరనాయక్

నరసరావుపేట: ప్రమాదవశాత్తు ఒంటిపై వేడిరసంపడి తీవ్రగాయాలపాలై ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గిరిజన బాలిక రామావత్ లక్ష్మీబాయిను రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్‌నాయక్ బుధవారం పరామర్శించారు. జిల్లాలోని వినుకొండ పట్టణం గిరిజన సంక్షేమశాఖ బాలికల గురుకుల వసతి గృహంలో గిరిజన బాలిక ఏడవ తరగతి చదువుతుంది. గత నెల 26న వసతి గృహంలో రాత్రి భోజనాలకు సంబంధించి వండిన పాత్రలను తోటి విద్యార్థినులతో కలసి మోసుకొస్తుండగా, ప్రమాదవశాత్తు వేడిరసం ఒలికి బాలిక కుడిచేయి, ఇతర శరీరభాగాలపై పడి తీవ్రగాయాలయ్యాయి. దీంతో అధికారులు హుటాహుటిన నరసరావుపేటలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ విషయం రాష్ట్ర ఎస్టీ కమిషన్ దృష్టికి వెళ్ళడంతో కమిషన్ సభ్యులు శంకర్‌నాయక్ క్షతగాత్ర బాలికను పరామర్శించారు. డాక్టర్లను అడిగి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని, బాలిక కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. బాధిత కుటుంబానికి, బాలికకు తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. భవిష్యత్‌లో ఇటువంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని భరోసా కల్పించారు. మీడియాతో శంకర్ నాయక్ మాట్లాడుతూ జరిగిన ఘటన పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ద్వారా అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపా రు. అనంతరం కలెక్టరేట్‌కు వెళ్లి పరిస్థితిని కలెక్టర్ ఎల్.శివశంకర్‌కు వివరించారు. దీనిపై సమగ్ర విచారణ నిర్వహించి ఘటనకు కారణమైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై స్పందించిన కలెక్టర్ బాలికకు మెరుగైన వైద్య సహాయం అందేలా ఆదేశిస్తామన్నారు. విచారణ జరిపి తీసుకున్న చర్యల నివేదికను కమిషన్‌కు పంపుతామని తెలిపారు. భవిష్యత్‌లో ఇటువంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలియజేసినట్లు శంకరనాయక్ పేర్కొన్నారు. జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిణి వరలక్ష్మి, తహసీల్దారు ఆర్‌వీ రమణానాయక్ పాల్గొన్నారు.

గొరిజవోలులో పునఃప్రతిష్టా మహోత్సవం



శాంతిహోమాలు నిర్వహిస్తున్న వేదపండితులు

నాదెండ్ల: మండలంలోని గొరిజవోలు గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. గ్రామంలో సుమారు రూ.90 లక్షల వ్యయంతో పలు ఆలయాలను జీర్ణోద్ధరణ పనులు గావించి గురువారం ఉదయం పునఃప్రతిష్టా మహోత్సవాలు నిర్వహించనున్నారు. కార్యక్రమాల నిర్వహణకు కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. వరసిద్ధి ఆలయ పునఃప్రతిష్ట, ఎదురుగా నందీశ్వరుడు, జీవధ్వజస్తంభం, విమాన గోపుర కలశ ప్రతిష్ట, సీతాలాంబ (బొడ్డురాయి), నాలుగుదిక్కుల గవిడి రాళ్లు, శ్రీ పోలేరమ్మ అమ్మవారు, పోతురాజు, శ్రీ అంకమ్మతల్లి (గ్రామ దేవత) ఆలయాల పునఃప్రతిష్ట కార్యక్రమాలను గురువారం ఉదయం 7.19 గంటలకు ప్రారంభం కానున్నాయి.

పండితులు శ్రీమాన్ పర్చూరి మాధవాచార్య, బ్రహ్మశ్రీ కౌశిక్ వెంకట రమణ స్వామి బృందం ఆధ్వర్యంలో ఈ ప్రతిష్ట కార్యక్ర మాలు నిర్వహించనున్నారు. బుధవారం ఉదయం ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు. రెండు రోజులుగా ప్రత్యేక చలువ పందిళ్లలో శాంతిహోమాలు నిర్వహిస్తున్నారు. ప్రతిష్ట అనంతరం అన్నదానం చేయనున్నారు. ఆలయాలను విద్యుత్‌దీపాలతో అలంకరించారు. రాత్రి మహిళా కోలాటం, భజనా కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

రేపు బొప్పూడి బాజీబాబా దర్గా ఉరుసు



బాజీ బాబావారి దర్గా

చిలకలూరిపేటటౌన్: మండలంలోని బొప్పూడి గ్రామంలో వేంచేసి ఉన్న హజరత్ సయ్యద్ బాజీ బాబా 40వ ఉరుసు మహోత్సవం శుక్రవారం నిర్వహించనున్నట్లు దర్గా ముజావర్ బాలసైదా బాబు, అభివృద్ధి కమిటీ సభ్యులు బాజీషహీద్ బ్యాటరీవర్క్స్ షేక్ ఖాజా తెలిపారు. బొప్పూడి గ్రామం ప్రారంభంలో ఉన్న ఈ దర్గాలో ఈనెల 5వ తేదీన వేకువ జామునుంచే ఉరుసు ఉత్సవాలు ప్రారంభం అవుతాయన్నారు. ఈ సందర్భంగా దర్గాకు మరమ్మతులు, నూతన రంగులు వేయించారు. ఉరుసు ఉత్సవాలకు విచ్చేసి భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఏటా క్రమం తప్పకుండా భారీగా చేసే ఈ ఉరుసు ఉత్సవాలు రెండేళ్ల కోవిడ్ కాలంలో నిర్వహించ లేదన్నారు. ఈ ఏడాది భారీగా కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. గ్రామం నుంచి దర్గావరకు, అక్కడ నుంచి హైవేవెళ్లే మార్గంలో కొంతమేర విద్యుత్తు దీపాలంకరణ చేస్తున్నట్లు వివరించారు. సుదూర ప్రాంతాల నుంచి బాజీబాబా దర్శనానికి వచ్చే భక్తుల కోసం శుక్రవారం రాత్రి భారీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. అదే రోజు రాత్రి బొప్పూడి గ్రామం నుంచి బాబావారీ గంథం బయలుదేరి గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఊరేగింపు ఉంటుందన్నారు. దర్గా వద్ద పలు ఖురాన్ బోధన, నమాజ్ తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలతో భక్తులు జాగరం చేస్తారన్నారు. మరుసటి రోజు శనివారం తెల్లవారుజామున గంథం దర్గాకు చేరుకుంటుందని, ముజావర్ల ఆధ్వర్యంలో బాబావారికి ఫాతెహా(దీపారాధన) నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం గంథం, ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. వైభవోపేతంగా నిర్వహించే ఈ ఉరుసుమహోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై బాజీబాబాను దర్శించుకోవాలని కోరారు.

వేదంలో రామకృష్ణ శ్రీశకు డాక్టరేట్



నరసరావుపేట ఈస్ట్: పట్టణానికి చెందిన వేదాన్తం రామకృష్ణ శ్రీశ శ్రీవేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం నుంచి విద్యావారధి డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ పి.హెచ్‌డి పట్టాను రామకృష్ణకు అందచేశారు. కృష్ణ యజుర్వేదం (తైత్తిరీయ శాఖ)లోని కమ్ప విచారః అనే అంశంపై రామకృష్ణ చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ లభించింది. శ్లోకాలలోని శబ్దధ్వని శాస్త్రీయ విషయం, యంత్ర నిర్దిష్టమైన అంశం ఒకటే అని నిరూపిస్తూ రామకృష్ణ పరిశోధన పత్రాన్ని సమర్పించారు. వేదంలో పరిశోధన పత్రాన్ని సమర్పించి డాక్టరేట్ సాధించిన రామకృష్ణను ఆగమ పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ వేదాన్తం సత్యశ్రీనివాస అయ్యంగార్ అభినందించారు.

96 శాతం పింఛన్ల పంపిణీ



నాదెండ్ల: మండలంలో వైఎస్సార్ పెన్షన్ కానుక–సామాజిక భద్రతా పెన్షన్‌ల పంపిణీ బుధవారం మూడోరోజు 96 శాతంపైగా పూర్తి చేశారు. మే మాసానికి మండల పరిధిలో 9289 పింఛన్లకు గాను రూ.2,56,00,750లు పంపిణీ చేయాల్సి ఉంది. ఉదయాన్నే వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛను సొమ్ము పంపిణీ చేశారు. సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు పింఛన్ల పంపిణీని పర్యవేక్షించారు.

హనుమత్ వాహనంపై దర్శనమిచ్చిన రంగనాథుడు



హనుమత్ వాహనంపై ఊరేగుతున్న రంగనాథుడు

యడ్లపాడు: మండలంలోని సొలస గ్రామంలో గీతా నామస్మరణతో మార్మోగింది. పురాతన ఆలయం శ్రీభూసమేత రంగనాయకస్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. మూడోరోజైన బుధవారం నాడు ఆలయంలోని మూలవిరాట్‌కు గులాబీలతో అలంకరణ వార్షిక ప్రత్యేక పూజల్ని ఆలయ ప్రధాన అర్చకులు పర్చూరి రామకృష్ణమాచార్యులు నేతృత్వంలో జరిగాయి. మధ్యాహ్నం గోవిందుడి విగ్రహాన్ని ధర్మకర్తలు అర్వపల్లి మనోహర్, నాగజ్యోతి, అర్వపల్లి బ్రదర్స్ ఆధ్వర్యంలో గోవింద నామాన్ని జపిస్తూ ప్రదర్శనగా తెచ్చి ఆలయంలో కొలువుంచి పూజలు చేశారు. ఈ సందర్భంగా గుంటూరు, పెదకూరపాడు ప్రాంతాలకు చెందిన భక్త సమాజంచే గీతాపారాయణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అర్చన హోమం , రంగనాథుడి కల్యాణ వేడుకల్లో భాగంగా అర్వపల్లి సాంబశివరావు, కామేశ్వరీదేవి, అర్వపల్లి వెంకటస్వామి, వెంకట రాజరాజేశ్వరీ దంపతులు పీటలపై కూర్చొని పూజలు చేశారు. సాయంత్రం రంగనాథుడికి పట్టువస్త్రాలు, వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి హనుమత్ వాహనంపై ఊరేగించారు. ప్రధాన వీధుల్లో జరిగిన గ్రామోత్సవంలో గ్రామపెద్దలు, భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ ఆధ్మాత్మిక కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులకు అన్నదానం, పలు రకాల ప్రసాదాలు వినియోగం చేశారు. ఆయా కార్యక్రమాలను ఆలయ ఈవో సీహెచ్ శివయ్య పర్యవేక్షించారు.

పంటల సాగులో రైతులు సూచనలు పాటించాలి



రైతులకు సూచనలు ఇస్తున్న ఇన్‌చార్జ్ ఏడీఏ శ్రీధర్‌రెడ్డి

సత్తెనపల్లి: గత రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు, రాబోయే రోజుల్లో కూడా వర్షం పడవచ్చునని వాతావరణ శాఖ సూచనల మేరకు దాళ్వా సీజన్‌లో వివిధ రకాల పంటలు సాగు చేస్తున్న రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని సత్తెనపల్లి ఇన్‌చార్జ్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్.శ్రీధర్ రెడ్డి చెప్పారు. సత్తెనపల్లి మండలం కొమెరపూడిలో బుధవారం ధాన్యాన్ని పరిశీలించిన ఆయన మాట్లాడారు. శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ శాస్త్రవేత్తల సలహాలు, సూజనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ప్రస్తుతం వరి, మిరప, మొక్కజొన్న, జొన్న పంటలు కోత దశలో ఉన్నాయన్నారు. వరి పైరు ప్రస్తుతం కొత్త దశలో ఉందని, గింజ రంగు మారకుండా ఉండుటకు కార్బండిజం, మ్యాంకోజెబ్ రెండు గ్రాములు లీటర్ నీటికి కలిపి సాయంత్రం వేళల్లో పిచికారీ చేయాలన్నారు. పైరు పడిపోయిన లేదా కోసి పనుల మీద ఉండి నీరు నిలిచినచో గింజ మొలకెత్తకుండా ఉండుటకు నీరు తీసివేసి ఐదు శాతం ఉప్పు ద్రావణం (50 గ్రాముల కళ్ళు ఉప్పు, లీటర్ నీటి కి) పిచికారీ చేయాలన్నారు. మొక్కజొన్న కోత దశలో ఉన్న పంట కొన్ని ప్రాంతాల్లో నేలకు వాలిందని, వర్షాలు ఆగిన వెంటనే కూలీలతో పంటను కోయించి కండెలు ఆరబెట్టుకోవాలన్నారు. మొక్కజొన్న కండెలకు పొరలు ఉండటం వలన సాధారణంగా గింజ మొలకెత్తదని, ఒకవేళ కండలు బాగా నాని గింజలు మొలకెత్తినట్లయితే ఐదు శాతం (50 గ్రాముల కళ్ళు ఉప్పు లీటర్ నీటికి కలిపి) ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలన్నారు. తడిసిన కండెలు బూజు రాకుండా ఉండుటకు కాపర్ ఆక్సి క్లోరైడ్ మూడు గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. మిరప పంట మూడవ కోత చివరి దశలో ఉందని, కొన్నిచోట్ల కోసిన మిరపకాయలను రైతులు కళ్లాలలో ఆరబెడుతున్నారని, ఆరిన కాయలను ఒక చోటకు చేర్చి శిల్పాలిన్ పట్టలతో కప్పాలన్నారు. ఆయనతో పాటు రైతులు, సిబ్బంది ఉన్నారు.

అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబానికి ఆర్థిక సాయం



బాజీకి ఆర్థిక సాయం అందజేస్తున్న సర్దార్

సత్తెనపల్లి: పట్టణంలోని 25వ వార్డులో గత కొన్ని రోజుల నుంచి బాజీ, ఆయన తల్లి జహీరా ఇరువురు అనారోగ్యంతో బాధపడుతున్న దృష్ట్యా ఒంగోలుకు చెందిన సూర్య చారిటబుల్ ట్రస్టు సెక్రెటరీ సర్దార్ చేయూతను అందించేందుకు ముందుకు వచ్చారు. గత నెలలో రూ. 30 వేలు ఆర్థిక సాయం అందించిన సర్దార్ మంగళవారం మరో రూ. 20 వేలు ఆర్థిక సాయం అందజేశారు.ఈ సందర్భంగా సర్దార్ మాట్లాడుతూ ప్రతినెలా ఆ కుటుంబానికి రూ. 5 వేలు అందిస్తానని ప్రకటించారు. తనకు చేతనైన సహాయ సహకారాలు తన మిత్రులు ద్వారా చేస్తానన్నారు. సత్తెనపల్లిలో బాజీ, ఆయన తల్లి జహీరాలకు సహాయం అందించేందుకు తనకు సలహాలు, సూచనలు ఇచ్చిన మైనార్టీ నాయకులు నాగూర్ అల్లా బక్షు, సత్తెనపల్లి వైఎస్సార్ సీపీ మైనార్టీ నాయకులు షేక్ జానీ, మరి కొంతమంది మిత్రులకు ధన్యవాదాలు తెలిపారు. మాజీ వక్ఫ్ బోర్డు డైరెక్టర్ షేక్ జానీ మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడే వారి కుటుంబాన్ని ఆదుకునేలా ప్రోత్సహించిన తనసోదరుడు నాగూర్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఒంగోలుకి చెందిన మిత్రులు సర్దార్ ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వ హించారని, అలాంటి వ్యక్తి సత్తెనపల్లి పట్టణానికి వచ్చి రూ.50 వేలు అందజేసి ప్రతినెలా ఆ కుటుంబానికి రూ. 5 వేలు అందిస్తాననడం చాలా సంతోషమైన విషయమన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సర్దార్‌కి ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ నాయకులు పెద్దింటి నాగేశ్వరరావు, టైలర్ ఖాజావలి తదితరులు ఉన్నారు.

ముగ్గురు సభ్యులతో ప్రజాసమస్యల సమన్వయ కమిటీ

బొల్లాపల్లి : కలెక్టర్ ఆదేశానుసారం సమస్యలపై వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించేందుకు ముగ్గురు సభ్యులతో కమిటీకి శ్రీకారం చుట్టారని తహసీల్దార్ వి.సుధాకర్‌శర్మ బుధవారం తెలిపారు. ఈ కమిటీలో సభ్యులుగా తహసీల్దార్, ఎంపీడీవో, స్టేషన్‌హౌస్ ఆఫీసర్ ముగ్గురు ఉంటారని చెప్పారు. వారంలో ప్రతి సోమవారం ప్రజా సమస్యలపై వచ్చిన వివిధ ఫిర్యాదులపై మంగళవారం కమిటీ సమావేశమవుతుందని చెప్పారు. ఈ సమావేశంలో అర్జీలను పరిష్కరించి తగిన పురోగతిపై వివరాలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు సమాచారం తెలియజేయాల్సి ఉంటుందన్నారు.

ఘనంగా బ్రహ్మం గారి కల్యాణోత్సవం

రొంపిచర్ల: మండలంలో వీరవట్నం గ్రామంలో వేంచేసియున్న శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో బుధవారం శ్రీ బ్రహ్మంగారి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో శ్రీ బ్రహ్మంగారి స్వామివారిని, గోవిందమాంబ అమ్మ వారిని ప్రత్యేకంగా, అందంగా అలంకరించి విశేష, సహస్రనామ, కుంకుమార్చన, అలంకరణ పూజలు నిర్వహించారు. మంత్రోచ్చారణల నడుమ బ్రహ్మంగారి కల్యాణం నిర్వహించారు. గ్రామస్తులు, భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో ఆలయాన్ని సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. రాత్రి వేళలో భజనా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్యారేజీలో కార్మికుడి మృతి

చిలకలూరిపేటటౌన్: ఆర్టీసీ డిపో గ్యారేజీలో జరిగిన ప్రమాదంలో కార్మికుడు మృతి చెందిన సంఘటన బుధవారం వెలుగు చూసింది. డిపో మేనేజర్ రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం చిలకలూరిపేట మండలం మిట్టపాలెంకు చెందిన ఎస్ లక్ష్మయ్య (55) గ్యారేజీలో హెల్పర్‌గా పనిచేస్తుంటాడు. గతంలో ఇతను డ్రైవర్‌గా పనిచేస్తూ, అనారోగ్య కారణాలతో గ్యారేజీలో హెల్పర్‌గా చేరాడు. అయితే మంగళవారం రాత్రి బస్సు రివర్స్ చేస్తున్న సమయంలో వెనుక ఉన్న లక్ష్మయ్య బస్సుకు తగలటంతో గాయాలపాలయ్యాడు. గమనించిన తోటి కార్మికులు పట్టణంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇరువురు కుమారులు ఉన్నారు.